సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం ၊ 6 ၊ ఫిబ్రవరి ၊ 2023



క్షీరారామంలో చండీ హోమం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో మాఘ పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి.



రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆలయానికి ఒక్కరోజు ఆదాయం రూ.1.17.299 లభించినట్టు దేవస్థాన చైర్మన్ తెలిపారు.

గజలక్ష్మిగా మావుళ్లమ్మ



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మవారి ఆలయ 59వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆదివారం గజలక్ష్మిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన ముద్రగడ



మంత్రి కారుమూరి నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల మంత్రి కారుమూరి మావ అంగడాల నాంచారయ్య పరమపదించిన సందర్భంగా ముద్రగడ తణుకులోని మంత్రి కారుమూరి నివాసంలో ఆయన్ను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కొద్దిసేపు రాజకీయాలపై చర్చించారు. అనంతరం ముద్రగడ తన స్వగ్రామమైన కిర్లంపూడికి వెళ్లారు. ఆయన వెంట రాష్ట్ర కాపు సంఘ నాయకులు ఉన్నారు.

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ నివారణ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ సూర్యచంద్రరావు, డాక్టర్లు

ఏలూరు రూరల్: హ్యూమన్ పాపిల్‌మ వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్‌తో సర్వేకల్ క్యాన్సర్‌ను నివారించవచ్చని మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ సారథి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మద్యపానం, ధూమపానం అలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం వల్ల క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ మనోజ్‌కుమార్, ఎంసీహెచ్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు క్యాన్సర్ లక్షణాలు, నివారణపై అవగాహన కల్పించారు. గుడ్‌సమరిటన్ క్యాన్సర్, జనరల్ ఆస్పత్రి నిర్వాహకులు ఫాదర్ సిజి గ్జేవియర్, అజో పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమానికి ఏఎస్పీ సూర్యచంద్రరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆస్పత్రి పీఆర్వో పి.రాజు, సీహెచ్ జాన్‌మార్ట్, సీహెచ్ వినిల్ పాల్గొన్నారు.

బాలోత్సవం.. మధుర జ్ఞాపకం



హేలాపురి బాలోత్సవం వేదికపై బృంద నృత్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చిన్నారుల జీవితాల్లో బాలోత్సవం మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందని బాలోత్సవం రూపకర్త డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు అన్నారు. స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో హేలాపురి బాలోత్సవం 3వ పిల్లల సంబరాలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ప్రారంభ కార్యక్రమంలో రమేష్‌బాబు మాట్లాడుతూ కొత్తగూడెంలో 25 ఏళ్లపాటు తాను చేపట్టిన బాలోత్సవం అన్ని ప్రాంతాలకు విస్తరించడం అభినందనీయమన్నారు. పాశ్చాత్య సంస్కృతికి కట్టడి వేస్తూ బాల్యంలోనే అభ్యుదయ విలువలకు బాటలు వేయాల్సి ఉందన్నారు.

జానపద నృత్యానికి విశేష ఆదరణ

బాలోత్సవంలో జానపద నృత్య పోటీలకు విశేష ఆదరణ లభించింది. 80కి పైగా బృందాల్లో సుమారు 1,000 మంది విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పల్లె వాతావరణంతో కూడిన పాటలు, లంబాడి జానపద నృత్యం, దేశభక్తి భావంతో ఉన్న పాటలను చక్కగా ప్రదర్శించారు.

ఆలోచింపజేసిన లఘు నాటికలు

దేశభక్తిని ప్రేరేపించే అంశాలు, కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న పాశ్చాత్య నాగరికత ప్రభావాలకు భిన్నంగా నేటి తరానికి అవసరమైన అభ్యుదయ అంశాలతో కూడిన లఘు నాటికల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అకడమిక్ పోటీలు : ఏకపాత్రాభినయం, కోలాట నృత్యాలు, అభ్యుదయ పాటలు, విచిత్ర వేషధారణ, శాస్త్రీయ నృత్యం, మట్టి బొమ్మల తయారీ, క్విజ్, మెమొరీ, కథలు చెప్పడం వంటి అకడమిక్ పోటీలు పెద్ద ఎత్తున సాగాయి. రెండో రోజు పోటీల్లో సుమారు 4 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాలోత్సవం కార్యక్రమానికి జిల్లాలో మంచి స్పందన లభించడంపై ఉత్సవ కమిటీ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. సాయంత్రం ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందించారు.

వరించిన అదృష్టం

ఖరీఫ్.. రిలీఫ్

- రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణ
- సకాలంలో రైతుల ఖాతాలకు సొమ్ముల జమ
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 7.41 లక్షల టన్నుల కొనుగోలు
- 92 రోజులపాటు సాగిన ప్రక్రియ
- ముగిసిన కొనుగోళ్లు



సిరుల పంట: వరి పట్టుబడులు (ఫైల్)

ధాన్యం కొనుగోలు ప్రారంభం 2022 నవంబర్ 6	
ధాన్యం కొనుగోలు ముగింపు 2023 ఫిబ్రవరి 5	
ఏలూరు జిల్లా	
ధాన్యం సేకరణ	3.66 లక్షల టన్నులు
రైతుల ఖాతాలకు జమ	రూ.628 కోట్లు
రైతు భరోసా కేంద్రాలు	284
పశ్చిమగోదావరి జిల్లా	
ధాన్యం సేకరణ	3.75 లక్షల టన్నులు
రైతుల ఖాతాలకు జమ	రూ.729.87 కోట్లు
రైతు భరోసా కేంద్రాలు	296

సాక్షి ప్రతినిధి, ఏలూరు/ఆకివీడు: దాళ్వా పంట రైతుల ఇంట సిరులు పండించింది. అన్నదాతల మోముల్లో ఆనందం నింపింది. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణలో ప్రవేశపెట్టిన ఈ–ప్రొక్యూర్ విధానం సత్ఫలితాలనిచ్చింది. అధికారులు, సిబ్బంది పొలాల వద్దకే వెళ్లి ధాన్యం సేకరించడంతో పాటు 21 రోజుల్లోపు రైతుల ఖాతాల్లోకి సొమ్ములు జమచేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 92 రోజులపాటు కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 2 లక్షల మంది రైతుల నుంచి 7.41 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. మిల్లర్లు, దళారులకు పూర్తి స్థాయిలో చెక్ పెడుతూ రైతు నుంచే నేరుగా ధాన్యం కొనుగోలు చేసింది. ఉమ్మడి జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఆదివారంతో ముగిసింది.

సరి'కొత్త'గా సేకరణ

సాంకేతిక సమస్యలు, రవాణా ఇబ్బందులు వంటి బాలారిష్టాలను దాటుకుని జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా సాగింది. దళారుల పాత్రను నిర్వీర్యం చేసి రైతుకు ఆదాయం పెంచే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో శ్రీకారం చుట్టింది. గతంలో రైతులు పొలం వద్దే ధాన్యాన్ని దళారీకి విక్రయించే పద్ధతి జిల్లాలో ఎక్కువగా ఉంది. దీనిని పూర్తిస్థాయిలో మార్చేలా, మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుని కొనుగోలు కేంద్రాలకు మిల్లులను అనుసంధానం చేశారు. ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తరలించి రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసి 21 రోజుల్లో అన్నదాతల ఖాతాల్లోకి నగదు జమ చేశారు. జనవరిలో పంటను విక్రయించిన రైతులకు సంక్రాంతి పండగకి ముందే నగదు జమ చేయడం విశేషం.

ఫలించిన సన్నాహాలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కలెక్టర్లు ఖరీఫ్ ప్రణాళికకు పక్కాగా సన్నాహాలు చేశారు. వ్యవసాయ సలహా మండలి, మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో తరచూ సమావేశాలు నిర్వహించారు. అలాగే రైతు భరోసా కేంద్రాలకు వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు ఇతర విభాగాల ఉద్యోగులను కూడా కేటాయించి కొనుగోలు ప్రక్రియ వేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు జిల్లాలో గోనె సంచుల కొరతను అధిగమించి పెద్దసంఖ్యలో సంచులు అందుబాటులోకి తీసుకువచ్చారు.

98 శాతానికి పైగా సేకరణ

ఏలూరు జిల్లాలో 284 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి 3.66 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.628 కోట్లను రైతులకు చెల్లించారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగాయి. 296 రైతుభరోసా కేంద్రాల ద్వారా 98,117 మంది రైతుల నుంచి 3,75,400 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.729.87 కోట్ల నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇక్కడ కేవలం 2 వేల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాల్సి ఉంది. మొత్తంగా రెండు జిల్లాల్లో 98 శాతానికి పైగా కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యింది. ఇదిలా ఉండగా సార్వా సీజన్‌కు సంబంధించి ఏలూరు జిల్లాలో 1,00,932 ఎకరాల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో 2 లక్షలకుపైగా ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి.

రవాణా, హమాలీ చార్జీల చెల్లింపు ఇలా..

ధాన్యం సేకరణలో నూతన విధానంలో భాగంగా రైతులు నేరుగా ధాన్యాన్ని మిల్లులకు చేరవేస్తే రవాణా, హమాలీ చార్జీలను ప్రభుత్వం అందించింది. ఇలా పశ్చిమగోదావరి జిల్లాలో రూ.5,26,46,000 హమాలీ చార్జీలకు గాను రూ.3,47,05,000, అలాగే రూ.4,09,12,000 హమాలీ చార్జీలకు గాను రూ.4,04,24,000 చెల్లించింది. అలాగే గోనె సంచుల అద్దె కింద రూ.2.74 కోట్లను రైతుల ఖాతాలకు జమచేసింది.

సకాలంలో చెల్లింపులు



పశ్చిమగోదావరి జిల్లాలో 3,75,400 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.729.87 కోట్లు చెల్లించాం. మరికొందరికి నాలుగు రోజుల్లో సొమ్ము జమ కానుంది. రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యాన్ని సకాలంలో కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– పి.ప్రశాంతి, కలెక్టర్, పశ్చిమగోదావరి

సజావుగా ప్రక్రియ



ఏలూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తిచేశాం. జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి నేరుగా వారి ఖాతాలకు నగదు జమ చేశాం. జిల్లాలో 92 రోజులపాటు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాగింది. లక్ష్యానికి మించి సేకరించాం.

– పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్, ఏలూరు జిల్లా

సొసైటీల ద్వారా సేవలు



నూతనంగా ప్రవేశపెట్టిన ధాన్యం కొనుగోలు ఈ–ప్రొక్యూర్ విధానంలో సొసైటీల సిబ్బంది విశేష సేవలందించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 110 సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేశాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని తమ సిబ్బంది రైతులకు సకాలంలో అందజేయడంతో కొనుగోళ్లు వేగవంతంగా జరిగాయి. రైతులంతా ఆనందంగా ఉన్నారు.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

నేతన్నల అభివృద్ధికి కృషి

తణుకు టౌన్: రాష్ట్రంలో చేనేత కులాలకు దిశ, దశలను నిర్దేశించిన నాయకుడు సీఎం జగన్ అని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు కేశవ స్వామి ఆలయంలో ఆదివారం రాష్ట్ర చేనేత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన పద్మావతి అమ్మవారికి సారె, చీర సమర్పణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ కులాల అభివృద్ధి, సంక్షేమానికి 56 కార్పొరేషన్లను ఏర్పాటుచేశామన్నారు. వాటిలో చేనేత కులాలకు సంబంధించి 4 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి వారి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీ సంక్షేమానికి సీఎం జగన్ పాటుపడుతున్నారన్నారు. తణుకులో పద్మశాలీలకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వెంకటరమేష్, రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మి, ఎంపీపీ రుద్రా ధనరాజు, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పద్మశాలీ కుల పెద్దలు నక్కా సీతారామయ్య, ఆకురాతి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న దృశ్యం

ఆరుగురు ఎస్సైల బదిలీ

సాక్షి, భీమవరం: జిల్లాలోని ఆరుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎస్సై పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎన్.శ్రీనివాసరావు	వీఆర్ భీమవరం	పాలకోడేరు పీఎస్
సీహెచ్‌ఎస్ రామచంద్రరావు	పాలకోడేరు పీఎస్	డీసీఆర్‌బీ భీమవరం
ఏజీఎస్ మూర్తి	డీసీఆర్‌బీ భీమవరం	కాళ్ల పీఎస్
ఆర్.మల్లికార్జునరెడ్డి	కాళ్ల పీఎస్	ట్రాఫిక్ పీఎస్ భీమవరం
బి.మోహనరావు	ట్రాఫిక్ పీఎస్ భీమవరం	భీమవరం రూరల్ పీఎస్
బి.అప్పలరాజు	భీమవరం రూరల్ పీఎస్	వీఆర్ భీమవరం

గాయత్రీమాతా నమోస్తుతే

పాలకొల్లు అర్బన్: లోక కల్యాణార్థం, వాయు మండలాన్ని శుద్ధిజేయాలనే లక్ష్యంతో సకారాత్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సత్య సేవక్ ప్రేమ్ నిరంతర్ గురూజీ (నాన్న) ఆధ్వర్యంలో మండలంలోని ఉల్లంపర్రు ఏఎస్ఆర్ నగర్ ప్రాంగణంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం మహాసంకల్ప విశ్వశాంతి గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. సుమారు 1,600 మంది దంపతులతో మూడు బ్యాచ్‌లుగా యజ్ఞం జరిగింది. దంపతులకు హోమ ద్రవ్యాలు, పూజా సామగ్రిని నిర్వాహకులు అందించారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత రక్షణా విభాగం ఎస్పీ కొండా నరసింహరావు–మంగాదేవి దంపతులు యజ్ఞాన్ని ప్రారంభించారు. తెలంగాణకు చెందిన యామ వీరేష్–విజయ దంపతులు 108 దక్షిణావృత శంఖాలను సమర్పించారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్–బాలాత్రిపుర సుందరి దంపతులు, అద్దేపల్లి విశ్వనాథం, అద్దేపల్లి శ్రీరామారావు తదితరులు వేదికపై యజ్ఞంలో పాల్గొన్నారు. సోమంచి శ్రీనివాస శాస్త్రి బ్రహ్మత్వంలో కటకం హరి ప్రవీణ్‌శర్మతో పాటు 10 మంది రుత్విక్కులు పూజాదికాలు నిర్వహించారు. మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, గజల్ శ్రీనివాస్, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు పెన్మెత్స సూర్యనారాయణ రాజు (డీటీడీసీ బాబు), రేపూరి సూర్యనారాయణ, పెన్మెత్స సాయిరాజు, కేవీ ఎస్ఎల్ నరసింహరాజు, కేఎస్ వాసు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గాయత్రీమాత



యజ్ఞ పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ దంపతులు



ఉల్లంపర్రులో మహాసంకల్ప విశ్వశాంతి గాయత్రీ మహాయజ్ఞంలో పాల్గొన్న దంపతులు

22 కిలోల గంజాయి స్వాధీనం

ఉండి: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కె.గంగాధరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి బస్టాండ్‌లో రాజస్థాన్‌కు చెందిన విక్రందాన్ చరణ్, దినేష్‌కుమార్‌మాలీ, రాజ్‌పుత్ ఆసుసింగ్‌ను అదుపులోకి తీసుకోగా వారి బ్యాగుల్లో 22 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. రాజస్థాన్ నుంచి రాజమండ్రిలో రైలు దిగిన వీరు అక్కడి నుంచి గంజాయిని విక్రయించేందుకు ఉండి వచ్చారన్నారు. విక్రందాన్ చరణ్ ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసుల్లో నిందితుడిగా కూడా ఉన్నాడన్నారు. మిగిలిన ఇద్దరితో కలిసి ముఠాగా గంజాయి వ్యాపారం చేస్తున్నాడన్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

'గడపగడపకూ' అభివృద్ధి

పనులకు వందనం

- 'గడపగడపకు' కార్యక్రమంలో పనులకు ప్రాధాన్యం
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- మైనర్ పంచాయతీలకు వరం
- జిల్లాలో ముమ్మరంగా పనులు





వీరవాసరం మండలం తోకలపూడిలో సీసీ రోడ్డు నిర్మాణం, పాలకొల్లు 16వ వార్డులో డ్రెయిన్ నిర్మాణం

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేందుకు ప్రభుత్వం సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రజా ప్రతినిధులు గడపగడపకు కార్యక్రమంలో భాగంగా వారి దృష్టికి వచ్చిన మౌలిక వసతుల సమస్యలను గుర్తించి ఆయా పనులకు తీర్మానం చేయించి జీజీఎంపీ పనుల్లో నిధులు మంజూరు చేయించి త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఏఏ పనులంటే.. సచివాలయ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, పారిశుద్ధ్య, లైటింగ్ తదితర పనులు చేపడుతున్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అత్యవసరమైన పనులకు ముందుగా ప్రాధాన్యమిస్తూ నిధులను వెచ్చిస్తున్నారు.

22.05 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు

జిల్లావ్యాప్తంగా జీజీఎంపీ నిధులతో 22.05 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు మంజూరు చేయగా ఇప్పటివరకు 8.02 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. సీసీ రోడ్లకు సంబంధించి మొత్తం 414 పనులు చేపట్టగా 95 పనులు పూర్తయ్యాయి.

జిల్లావ్యాప్తంగా 1,035 పనులు

జిల్లాలో ఇప్పటివరకూ 1,035 పనులు మంజూరు చేయగా 837 పనులు జరుగుతున్నాయి. సుమారు 100 పనులు పూర్తయ్యాయి. మరో 158 పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారు. జిల్లాలోని 19 మండలాలు, 6 మున్సిపాలిటీల్లో పనులు 80 నుంచి 90 శాతం మేర పురోగతిలో ఉన్నాయి. జీజీఎంపీ నిధులు మైనర్ పంచాయతీలకు వరంలా మారాయి. ఆయా నిధులతో మౌలిక వసతులు కల్పించడంతో గ్రామంలో సమస్యలు పరిష్కారమవుతున్నాయి. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

శాఖల వారీగా పనులు ఇలా..

- పంచాయతీరాజ్ శాఖ ద్వారా 466 పనులు మంజూరు కాగా 424 పనులు చేపట్టారు. 42 పనులు చేపట్టాల్సి ఉంది.
- ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా 172 పనులు మంజూరు కాగా 158 పనులు చేపట్టారు. 14 పనులు చేపట్టాల్సి ఉంది.
- విద్యుత్ శాఖ ద్వారా 5 పనులు మంజూరు కాగా 3 పనులు చేపట్టారు. 2 పనులు చేపట్టాల్సి ఉంది.
- మున్సిపాలిటీల్లో 392 పనులు మంజూరు కాగా 184 పనులు జరుగుతున్నాయి. 108 పనులు చేపట్టాల్సి ఉంది.

రోడ్లు, డ్రెయిన్ నిర్మాణం



ప్రభుత్వం మా గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. గడపగడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి జీజీఎంపీ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్, కల్వర్ట్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. మూడు పనులు జరుగుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వీరవల్లి శ్రీనివాస్, సర్పంచ్, తోకలపూడి

జిల్లావ్యాప్తంగా పనులు




జిల్లావ్యాప్తంగా జీజీఎంపీ పనులు జరుగుతున్నాయి. సీసీ, గ్రావెల్ రోడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు చేపట్టాం. కలెక్టర్ ఆదేశాలు, సలహాల మేరకు వేగంగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో సుమారు 100 పనులు పూర్తికాగా 837 పనులు సాగుతున్నాయి. వీటిని వేగంగా పూర్తిచేసేందుకు కృషిచేస్తున్నాం.

– కేఎస్ఎస్ శ్రీనివాస్, జిల్లా పంచాయతీరాజ్ ఈఈ, భీమవరం

క్లుప్తంగా

నారసింహునికి చందనోత్సవం


ఉగ్రనారసింహుడికి చందనలేపనం

ద్వారకాతిరుమల: సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి చందనోత్సవాన్ని ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఐఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన ఉగ్ర నారసింహుడు చందనలేపంతో సేదతీరారు. భీష్మ ఏకాదశి పర్వదినాన ప్రారంభమైన స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున ఆలయంలో నిత్యహోమాలు, మూలమంత్ర హవనాలు జరిగాయి. అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలను ఆలయ అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు చందన మహోత్సవాన్ని వేద మంత్రోచ్చరణలతో పండితులు వైభవంగా నిర్వహించారు. ఉగ్రరూపంలో ఉండే లక్ష్మీనారసింహుడిని శాంతింపజేసే క్రమంలో జరిగిన ఈ ఉత్సవాన్ని వీక్షించిన భక్తులు పరవశించారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

దెందులూరు: జోగన్నపాలెం మలుపు వంతెన వద్ద ఆదివారం ఉదయం వృద్ధురాలి మెడలోని 20 కాసులు బంగారు గొలుసులను లాక్కునిపోయారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు ఆలూరి రాణి తెలిపిన వివరాల ప్రకారం.. మలుపు వంతెన వద్ద ఉండగా బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి తన మెడలో ఉన్న 3 బంగారు గొలుసులు లాక్కుపోయారని అన్నారు. బాధితురాలు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అక్కా చెల్లెమ్మలకు ఆసరా

- నాలుగు విడతల్లో డ్వాక్రా మహిళల ఖాతాలకు జమ
- మూడో విడతలో నిధులు అందించేందుకు రంగం సిద్ధం


డ్వాక్రా మహిళలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని అక్కా చెల్లెమ్మలకు వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ఆసరా పేరుతో మహిళల బ్యాంకు ఖాతాలకు ఇప్పటికే రెండు విడతలుగా నిధులు జమ చేశారు. తాజాగా మూడో విడత నిధులు అందించేందుకు అధికార యంత్రాంగం కార్యాచరణ రూపొందిస్తుంది. దీంతో ఏలూరు జిల్లా వ్యాప్తంగా 35,758 గ్రూపులకు చెందిన 3,55,392 మంది మహిళలకు రూ.328.38 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మొదటి రెండు విడతల్లో రూ.1,306.08 కోట్లు డ్వాక్రా మహిళల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. గత ఏడాది ఉగాది నాటి నుంచి జిల్లాల పునర్విభజన తరువాత మూడో విడత ఆసరా నిధులు అందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది.

జిల్లా వ్యాప్తంగా రూ.2,770 కోట్ల లబ్ధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా పథకం బాసటగా నిలిచింది. నాలుగు విడతల్లో మహిళల పొదుపు ఖాతాలకు ఆసరా సొమ్ము జమ చేస్తానని ప్రకటించారు. ఈ క్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మహిళలకు మొత్తం రూ.2,770 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. 2020–2021 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలివిడతలో భాగంగా సెప్టెంబర్ 11న వైఎస్సార్ ఆసరా పథకాన్ని సీఎం ప్రారంభించారు.

తొలివిడత రూ.689.89 కోట్ల లబ్ధి

ఆసరా పథకంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు 2020–21 ఆర్థిక సంవత్సరంలో తొలివిడతగా మొత్తం రూ.689.89 కోట్ల మేరకు లబ్ధి చేకూరింది. డీఆర్‌డీఏ పరిధిలోని 63,775 గ్రూపులకు చెందిన 6,34,934 మందికి రూ.616.19 కోట్ల ప్రయోజనం కలిగింది. మెప్మా పరిధిలోని పట్టణ ప్రాంతాల్లోని 8,926 గ్రూపులకు చెందిన 81,341 మంది మహిళలకు రూ.73.40 కోట్ల మేరకు లబ్ధి కలిగింది.

రెండో విడతలో రూ.693.61 కోట్ల మేరకు ప్రయోజనం కలిగింది. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 63,861 గ్రూపులకు చెందిన 6,35,871 మందికి రూ.618.01 కోట్ల లబ్ధి చేకూరింది. మెప్మా పరిధిలోని పట్టణ ప్రాంతాలకు చెందిన 9,033 గ్రూపులకు చెందిన 82,353 మంది మహిళలకు రూ.75.60 కోట్ల ప్రయోజనం కలిగింది. మూడో విడతలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా మహిళలకు రూ.328.38 కోట్ల మేరకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలోని 35,758 గ్రూపులకు చెందిన మొత్తం 3,55,392 మంది మహిళలకు లబ్ధి కలుగనుంది. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో దాదాపు 3 లక్షల మంది మహిళలకు రూ.300 కోట్లవరకూ లబ్ధి చేకూరనుంది.

ఆసరా పథకంతో ఆర్థిక పరిపుష్టి



ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఆసరా పథకాన్ని అమలు చేస్తుంది. గత ఎన్నికల ముందు నాటికి ఆయా డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తం ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ మొత్తాన్ని నాలుగు విడతల్లో మహిళల ఖాతాలకు జమ చేయనున్నట్లుగా ప్రకటించి ఇప్పటికే రెండు విడతలు ఆర్థిక సాయాన్ని జమ చేసారు. త్వరలో మూడో విడత నిధులు అందిస్తారు.

ఆర్.విజయరాజు,
పీడీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏలూరు

మహిళలకు కొండంత అండ



ఆసరా పథకం జిల్లాలోని డ్వాక్రా మహిళలకు కొండంత అండగా నిలిచింది. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వాటిని సక్రమంగా చెల్లిస్తూ, గ్రూపు కార్యకలాపాలను రెగ్యులర్‌గా నిర్వహించే అన్ని సంఘాలకు ఈ పథకం వర్తించింది. తొలివిడతలో పథకం వర్తించని గ్రూపులకు రెండోవిడతలో పథకం వర్తించింది. మూడో విడత ఆసరా నిధులను త్వరలోనే అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది.

ఎంఎస్‌డి భూషణం, బ్యాంక్ లింకేజ్ సమన్వయ కర్త, ఏలూరు

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ట


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: సమాజంలోని ప్రతి ఒక్కరూ దైవ భక్తితో ముందుకు సాగాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. వీరవాసరం మండలం రాయకుదురు శివారు నడపనవారి పాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక భావనల ద్వారా సమసమాజం ఏర్పడుతుందని తెలిపారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ కులమత వర్గాలకు అతీతంగా గ్రామస్తులంతా ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. స్వామివారి కరుణా కటాక్షాలు ప్రజలందరిపైనా ఉండాలన్నారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. గ్రామస్తులంతా స్వామివారి కలశాలను ఆలయంలో చేర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అఖండ అన్నసమారాధనను పెద్ద ఎత్తున చేపట్టారు. సమారు 20 రకాల పిండి వంటలను వడ్డించారు. ఈ సందర్భంగా జొన్నలపాలెం– వీరవాసరం రహదారిపై గొంతేరు డ్రెయిన్ వద్ద వంతెనను నిర్మించాలని ప్రజా ప్రతినిధులను ఆయా గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గూడూరి ఓంకారం, పాలకొల్లు జెడ్పీటీసీ నడపన గోవిందరాజులు నాయుడు, జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, కొత్తపల్లి రాంబాబు, ఏసు, కొత్తపల్లి కృష్ణ, సూర్య చంద్రరావు, గుర్రాల అబ్బులు, సాధనాల సూర్యచంద్రరావు, గుర్రాల అబ్బులు, బెల్లపుకొండ శ్రీనివాస్, కొత్తపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం


పెంటపాడు: మండలంలోని జట్లపాలెంలో గడపగడప కార్యక్రమంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతుడు శ్రీనివాసరావు(36)

మొగల్తూరు: సెంట్రింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ వైర్లు తగలడంతో తమ్ముడు మృతి చెందగా, అన్నకు తీవ్రగాయలైన సంఘటన ఆదివారం ముత్యాలపల్లి పంచాయతీ గెదళ్ళవంపులో జరిగింది. ఎస్‌ఐ ఎం వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం..ముత్యాలపల్లి పంచాయతీ గెదళ్ళవంపులో అదే ప్రాంతానికి చెందిన బందన మహలక్ష్మీ రావు, బంధన శ్రీనివాసరావులు సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇనుప ఊచల్ని మేడపైకి తీసుకెళ్ళే ప్రయత్నంలో ఊచలు 11 కేవీ విద్యుత్ వైర్లకు తగలడంతో షాక్ గురై శ్రీనివాసరావు(36) మేడపై నుంచి కింద పడి పోయాడు. తీవ్ర గాయలు కావడంతో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.

ఉంగుటూరులో యువకుడి మృతి


మృతుడు యర్రారపు రాజేష్


ఉంగుటూరు: ఉంగుటూరు దళిత పేటకు చెందిన యర్రారపు రాజేష్(పండు) హత్యకు గురయ్యాడు. ఆదివారం వేకువజామున జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. రాజేష్‌కు అదే ప్రాంతానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉండేది. ఆదివారం వేకువజామున 3 గంటల సమయంలో ఆ మహిళ కోసం ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆమె అతనిని వెళ్ళిపోమని చెప్పింది. అయినా వినకుండా రాజేష్ ముందుకు రావడంతో ఆమె రాజేష్‌ని గెంటేసింది. దాంతో కింద పడిన రాజేష్ మరణించాడు. ఈ మేరకు సీఐ సుభాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య కేసు నమోదు చేశామని ఎస్‌ఐ స్వామి తెలిపారు. డాక్టరు నివేదిక మేరకు కేసు దర్యాప్తు కొనసాగిస్తామని తెలిపారు. రాజేష్ మృతదేహానికి తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

త్రోబాల్ నేషనల్స్‌కు 13 మంది ఎంపిక


త్రోబాల్ టీంలో నేషనల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశ్చిమ గోదావరి జిల్లా అండర్–19 జూనియర్స్ బాలురు, బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లాల నుంచి ఆరుగురు క్రీడాకారులు, సీనియర్స్ బాలురు, బాలికల విభాగంలో ఏడుగురు క్రీడాకారులు నేషనల్ ప్రాబబుల్స్‌కు ఎంపికైనట్లు ఉమ్మడి పశ్చిమ జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఏఆర్‌కే వర్మ, సెక్రటరీ ఎస్.ఎం.శ్రీధర్‌లు వెల్లడించారు. సెలక్షన్స్‌లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 18, 19 తేదీల్లో కేరళలో జరిగే నేషనల్స్‌లో పాల్గొంటారని తెలిపారు. అదే విధంగా ఈ నెల 15 నుంచి 17 వరకు జిల్లా త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్రోబాల్ కోచింగ్ శిబిరం విజయవాడలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అండర్–19 జూనియర్స్ బాలురు విభాగంలో రత్నకుమార్, అశోక్, గణేష్, రవితేజ, బాలికల విభాగంలో సీహెచ్ పల్లవి, గౌతమిలు సీనియర్స్ విభాగంలో బి.సుధీర్, కె.భగవాన్, టీఎస్‌వీ సాయి కుమార్, పి.నరేంద్ర, బాలికల విభాగంలో కె.రమ్యశ్రీ, ఎస్.శ్రేయ, బి.చిన్నారిలు ఎంపికయ్యారు.

బాస్కెట్‌బాల్ చాంపియన్‌గా ఉమ్మడి పశ్చిమ


చాంపియన్‌గా నిలిచిన ఉమ్మడి పశ్చిమ జట్టు

ఏలూరు రూరల్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల బాస్కెట్‌బాల్ జట్టు సత్తా చాటింది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచింది. ఈ నెల 3 నుంచి 5 వరకూ నూజివీడు వీటీహెచ్ గ్రౌండ్‌లో 66 వ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్–14 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న బాలికలు జట్టు లీగ్ దశలో నెల్లూరు జిల్లా జట్టుపై 34–02 పాయింట్లు, తూర్పుగోదావరిపై 18–14 స్కోర్‌తో గెలిచింది. క్వార్టర్‌ఫైనల్‌లో చిత్తూరు జట్టుపై 27–11, సెమీఫైనల్‌లో గుంటూరుపై 41–33 గెలిచి తుదిపోరుకు అర్హత సాధించింది. ఫైనల్‌లో మరోసారి తూర్పుగోదావరి జట్టుపై 30–22 స్కోర్‌తో గెలిచి విజేతగా అవతరించింది. మరోపక్క బాలురు జట్టు క్వార్టర్ ఫైనల్‌లో గుంటూరు జట్టు చేతిలో ఓటమి పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాల కృష్ణారావుకు మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఏఈఓ


భీమవరంలో హైకోర్టు న్యాయమూర్తులకు స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా మొదటి అదనపు జిల్లా జడ్జి మంగాకుమారి, భీమడోలు కోర్టు జడ్జి ఆదిత్య రిషిక్, ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

హైకోర్టు న్యాయమూర్తుల సందర్శన

సాక్షి, భీమవరం: భీమవరంలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తులు ఆకుల వెంకట శేష సాయి, సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌లు పర్యటించారు. భీమవరం న్యాయస్థాన సముదాయ ఆవరణలో నిర్మించనున్న భవన స్థలాలను వారు పరిశీలించారు. హైకోర్టు న్యాయమూర్తులకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. వారి వెంట జిల్లా న్యాయమూర్తులు పురుషోత్తంకుమార్, పి.శ్రీసత్యాదేవి, బార్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు వై.న్యూటన్, సీహెచ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి భోగేశ్వర స్వామి ఆలయం ముస్తాబు

ఈ నెల 16 నుంచి 20 వరకు ఉత్సవాలు


దేవాలయం వద్ద ఏర్పాటు చేస్తున్న పందిళ్లు

కైకలూరు(కలిదిండి): దక్షిణ కాశీగా పేరుగాంచిన కలిదిండి శ్రీ పార్వతీ సమేత శ్రీ పాతాళ భోగేశ్వరస్వామి దేవాలయం మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 16 నుంచి 20 వరకు కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు. 17వ తేదీ రాత్రి 1.20 గంటలకు పార్వతీ సమేత భోగేశ్వరుని కల్యాణం, 18వ తేదీ రాత్రి 8 గంటలకు స్వామివారి తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ అడవి వెంకట గంగాధరశర్మ, ధర్మకర్తలు వెంకట కృష్ణ ప్రసాద్, బలరామరాజు, భోగ రామరాజు, సుబ్బలక్ష్మీ, కుమారి, ధనలక్ష్మీ, అచ్చమ్మ తాటి కుమారిలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వేంగి రాజు రాజరాజ చోళుడు ఈ దేవాలయాన్ని పునఃప్రతిష్ట చేశారు. కలిదిండికి మూడు మైళ్ళ దూరంలో నిర్మానుష్య ప్రాంతంలో దేవాలయం ఉంది. ప్రతీ ఏటా శివరాత్రి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఈ కోనేరు వద్ద శివరాత్రి రోజున పితృ దేవతలకు పిండి ప్రదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది.

రూ.3 కోట్లతో రాజగోపుర నిర్మాణం



ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేశారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు రూ.3 కోట్లు రాజగోపుర నిర్మాణానికి వితరణగా అందించనున్నారు. శివరాత్రి తర్వాత పనులు ప్రారంభమవుతాయి. శివరాత్రి తీర్థానికి దాదాపు లక్ష మంది భక్తులు విచ్చేస్తారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. దేవాలయ ప్రాంగణాన్ని విస్తరించాం.

– శింగనపల్లి శ్రీనివాసరావు, ఆలయ ఈవో, కలిదిండి

హరీష్‌బాబుకు ఐఏఎఫ్ సిబ్బంది నివాళి


మృతుడు హరీష్‌బాబు(ఫైల్)


హరీష్‌బాబు మృతదేహంపై జాతీయ పతాకాన్ని కప్పుతున్న ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఇంటి హరీష్ బాబు(33) మృత దేహం వద్ద ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు, సిబ్బంది ఆదివారం గౌరవ వందనం సమర్పించారు. ఢిల్లీలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం చేస్తున్న హరీష్‌బాబుకు ఇటీవల వివాహం నిశ్చయం కావడంతో సంక్రాంతి పండుగకు ముందు స్వగ్రామానికి వచ్చాడు. ఈనెల 16న వివాహం జరగాల్సి ఉండగా, శనివారం ఇంట్లోని ఒక గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో సూర్యలంక నుంచి వచ్చిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది మృతుడి కుటుంబ సభ్యులకు రూ.80 వేలు చెక్కు, 9 వేల నగదును మట్టి ఖర్చుల నిమిత్తం అందజేసి, వారిని ఓదార్చారు. హరీష్‌బాబు మృత దేహంపై జాతీయ పతాకాన్ని కప్పి, పుష్పగుచ్ఛాలు ఉంచారు. అనంతరం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువుల అశ్రునయనాల మధ్య అంతిమ యాత్రను నిర్వహించారు. అంత్యక్రియలు ముగిసే వరకు ఒక ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి వెంటే ఉన్నారు. హరీష్‌బాబు ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

హత్య కేసులో నిందితుడి కోసం గాలింపు

ముసునూరు: మండలంలో సంచలనం సృష్టించిన జంట హత్య కేసులో నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారని నూజివీడు డీఎస్పీ ఈడే అశోక్ కుమార్ గౌడ్ తెలిపారు. కాట్రేనిపాడుకు చెందిన సొంగా ఏసు మరియమ్మ, ఆమె కూతురు అఖిల మృత దేహాలను శనివారం రాత్రి నూజివీడు ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాల్ డేటా ఆధారంగా నిందితుడుగా భావిస్తున్న దేవరపల్లి రవి (రవీంద్ర)ని పట్టుకునేందుకు ఏలూరు, హనుమాన్ జంక్షన్, విసన్నపేట, చింతలపూడి ప్రాంతాల్లో గాలింపు చేశారు. మంగళగిరి నుంచి ఫోరెన్సిక్ నిపుణుల బృందం ఆదివారం సాయంత్రం సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. నిందితుడు ఒక్కడే ఈ జంట హత్యలు చేశాడా లేదా ఇతరులు ఎవరైనా సహకరించారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


దెందులూరు మండలంలో రేషన్ బియ్యం సీజ్


ఆగిరిపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు ఆదివారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గన్నవరం మండలం ముస్తాబాద్ నుంచి పశ్చిమగోదావరి జిల్లాకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కా సమాచారంతో మండలంలోని ఎం.సూరవరం–కొమ్మూరు రోడ్డు వద్ద మాటు వేసి పట్టుకున్నారు. దాడిలో 5000 వేల కిలోల రేషన్ బియ్యం, వాహనం స్వాధీనం చేసుకున్నారు. వాహనం యజమాని సోలా రాము, డ్రైవర్ ఉలాస రామకృష్ణ, ఉలాస శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకున్నారు.

దెందులూరు మండలంలో..

దెందులూరు: దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద అక్రమ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సమాచారం మేరకు నెల్లూరు నుండి కాకినాడకు వెళ్ళే 29 టన్నుల అక్రమ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.

క్లుప్తంగా

ఘనంగా తేతలిలో గోగులమ్మ జాతర



తేతలి శ్రీ గోగులమ్మవారు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారి తీర్థం నిర్వహించారు. తేతలి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీలు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ, ఉప సర్పంచ్ కోట నాగేశ్వరరావు, సరెళ్ల కృపావరం, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు, మంతెన రామపరాజు, మంతెన బోసురాజు పాల్గొన్నారు.

'హెల్మెట్ ధరించి వాహనం నడపండి'



తణుకులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

తణుకు: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు తప్పవని తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక సజ్జాపురం ఫ్లైవోవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇటీవల జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువ శాతం హెల్మెట్ లేకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో 60 శాతం మంది హెల్మెట్ లేకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

సుదర్శన హోమం



శ్రీనివాస రామాలయంలో సుదర్శన హోమం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట శ్రీనివాస రామాలయంలో ద్వారకా తిరుమల అర్చక స్వాములు ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు శానం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఆలయంలో పంచామృత అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. సోమవారం వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం, మంగళవారం సంతాన వేణుగోపాలస్వామి హోమం, 13న చక్ర స్నానాలు జరుగుతాయని, భక్తులు పాల్గొని బ్రహ్మోత్సవాలను దర్శించాలని కోరారు.

ఉరుసు ఉత్సవాలు ప్రారంభం



దర్గాలో సమాధిపై గంధం పూస్తున్న పోషకురాలు అబ్బిన నాగమణి, కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలోని హజరత్ కాలే మస్తాన్ షా ఔలియా దర్గాలో ఆదివారం ఉరుసు మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 7వ తేదీ వరకు ఉరుసు మహోత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు సమాధిపై గంధం పూసే కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం దీపాలంకరణ కార్యక్రమం జరిపారు. దర్గా పోషకురాలు అబ్బిన నాగమణి, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవాలను వీక్షించేందుకు తాడేపల్లిగూడెం యశోద ఆసుపత్రి డాక్టర్ లక్కోజు రవికుమార్, అబ్బిన రాజీవ్, అబ్బిన గిరిజారాణి, అబ్బిన సహస్ర, స్రవతి దర్గాను దర్శించుకున్నారు.

నేడు జట్లపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెంటపాడు: జట్లపాలెం గ్రామంలో రెండోరోజు సోమవారం సాయంత్రం 4 గంటలకు గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ప్రజా సంక్షేమం విస్మరించడమే చంద్రబాబు ఖర్మ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జట్లపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం



జట్లపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: పద్నాలుగేళ్ల పరిపాలనలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించడం వల్లే చంద్రబాబుకు నిజంగానే ఖర్మ దాపురించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం పెంటపాడు మండలంలో జట్లపాలెం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల చంద్రబాబు పరిపాలనలో ప్రజాసంక్షేమాన్ని మరిచిపోయారని, ఇప్పుడు ఖర్మపేరిట టీడీపీ నాయకులు చేస్తున్న పని వల్ల వారి ఖర్మగా ప్రజలు భావిస్తున్నారన్నారు. ఏనాడైనా చెప్పింది చేస్తూ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తే ప్రజలు బ్రహ్మరథం పట్టేవారన్నారు. కాగా నేడు జగనన్న పరిపాలనలో ప్రజలు ప్రభుత్వంపై ఎంతో అభిమానం చూపుతున్నారన్నారు. పేదలకు ఇళ్లు, ఫించన్ల పెంపు, పేదల అభ్యున్నతికి ఎన్నో పథకాలు జగనన్న ప్రవేశపెట్టి ప్రతివారు దేవుని దయతో సంతోషంగా ఉన్నారన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. ప్రతి ఇంటి వద్ద పూలు చల్లుతూ, ఉప ముఖ్యమంత్రికి దండలు వేసి స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రభుత్వంపై చూపుతున్న అభిమానానికి ముగ్ధులయ్యారు. ఇప్పటికైనా దుష్టచతుష్టయం చేస్తున్న అసత్యప్రచారాన్ని మానుకోవాలన్నారు. జగనన్నపై టీడీపీ అనుకూలమీడియాలో అసత్య కథనాలను మానుకోవాలన్నారు. కారుకూతలు తగవన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారన్నారు. చంద్రబాబుకు వచ్చే ఎన్నికలలో బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, ఎంపీపీ దాసరి హైమావతి, గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, గ్రామ సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, పార్టీ నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షులు పెన్నాడ సూరిబాబు, సొసైటీ అధ్యక్షులు దేవ వెంకటరమణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులతో పాటు, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో దామోదరావు, అధికారులు పాల్గొన్నారు.

అరుణ పారాయణం



లలితాదేవి ఆలయంలో అరుణ పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాఘ శుద్ధ పూర్ణిమ, లలితాదేవి జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో శ్రీలలితాదేవి ఆలయంలో ప్రజల ఆరోగ్యం కోసం వేద పండితులతో అరుణ పారాయణం నిర్వహించారు. మల్లాది సూర్యకిరణ్ శర్మ బ్రహ్మత్వంలో నీలి కలువలతో విశిష్ట మూలమంత్ర హోమం, పంచసూక్త హోమాలు జరిగాయి. మానేపల్లి శ్రీనివాసరావు, ప్రవా శ్రీనివాసరావు, బుద్ధవరపు సత్యవెంకట సుబ్బారావు, టి.బాలకృష్ణ, పి.కల్యాణ్‌రామ్, పి.నరసింహాచార్యులు, మాధవరావు, కోటేశ్వరరావు, మల్లికార్జునరావు, వీర్రాజు, శివ, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత పైబోయినకు పితృవియోగం

అత్తిలి మండల అధ్యక్షుడు సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి కారుమూరి





విజేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి, అంతరచిత్రంలో పైబోయిన విజేయులు

అత్తిలి: వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షులు పైబోయిన సత్యనారాయణ తండ్రి పైబోయిన విజేయులు శనివారం రాత్రి గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. రాష్ట్ర పౌర సరఫరాశాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సత్యనారాయణ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి విజేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జిల్లా కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, నాయకులు చిట్టూరి వెంకట సుబ్బారావు, బోడపాటి వీర్రాజు, మంగెన సూర్య, పెన్మెత్స రామరాజు, బుడితి సుజన్‌కుమార్, కందుల సత్యనారాయణ, గారపాటి నాగరాజు, కోరుకొల్లు వెంకట్రావు, కంకటాల సత్యనారాయణ, సబ్బితి రాజేష్, మహ్మద్ షబ్బీర్, కాసగాని అబ్బులు పరామర్శించినవారిలో ఉన్నారు.

గృహ సారథులు కీలక భూమిక పోషించాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి
- తణుకులో వలంటీర్లు, గృహసారథుల ఆత్మీయ సమ్మేళనం



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: గృహ సారథులు రానున్న రోజుల్లో కీలక భూమిక పోషించాల్సి ఉంటుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు శ్రీబాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన వలంటీర్లు, గృహ సారథుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న మంచి పనులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తమ పరిధిలోని 50 ఇళ్లలో గృహ సారథులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. గృహసారథులకు ఎంతో ప్రత్యేక స్థానం ఉంటుందని, ఇకపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనుసన్నల్లోనే పనిచేసే పరిస్థితులు ఉంటాయని అన్నారు. వలంటీర్లతో కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గృహ సారథులు ప్రతి గృహానికి వెళ్లి వారితో మంచి చెడ్డ సంభాషించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 11వ తేదీ నుంచి ప్రత్యేక కార్యాచరణ ఉంటుందని పార్టీ అప్పగించిన విధివిధానాలను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. పార్టీపట్ల విధేయతగా పని చేసిన గృహసారథులకు మంచి గుర్తింపు కూడా ఉంటుందని చెప్పారు. సంక్షేమ పథకాల వివరాలతో పాటు ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న కుట్రలు కుతంత్రాలను కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతిపక్షనేత చంద్రబాబు హయాంలో సెంటు భూమి కూడా ప్రజలకు ఇవ్వలేదని కానీ నేడు వేలాది ఎకరాలు వేలాది కోట్లు వెచ్చించి సొంతింటి కల నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల జేసీఎస్ కన్వీనర్లు కరిబండి రాజేష్, పెన్మెత్స రామరాజు, మేడపాటి దినేష్‌రెడ్డి, డాక్టర్ దాట్ల సుందరరామరాజు, నత్త కృష్ణవేణి, డీజే అమూల్యారావు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు



విజేతలతో కరాటే శిక్షకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశాఖపట్టణంలో ఇటీవల నిర్వహించిన 6వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు పలు పతకాలు సాధించారని సీకో షాటోకాన్ అడ్వాన్స్‌డ్ కరాటే ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు ఆదివారం చెప్పారు. అండర్-12 కటా విభాగంలో ఎస్‌కే లీనా స్వర్ణం, కుమితి విభాగంలో స్వర్ణం సాధించదన్నారు. కటా, కుమితి విభాగాలలో ఆర్‌టీ నాయుడు రెండు రజత పతకాలు, అండర్-10 విభాగంలో కేవీ రిషికేశ్ కటా విభాగంలో రజతం సాధించారు. అలాగే అండర్-8 విభాగంలో ఎస్‌కే నసీరా కటా, కుమితి విభాగంలో స్వర్ణ, రజత పతకాలులు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను పలువురు అభినందించారు.

బియ్యం అందజేత



వృద్ధాశ్రమానికి బియ్యం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దాతలు కల్యాణ్, వాణి ఆర్థిక సహాయంతో ఆదివారం తాడేపల్లిగూడెం జీవన సంధ్య వృద్ధాశ్రమానికి 200 కేజీలు, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంకు 150 కేజీలు, నిడదవోలు లెప్రసీ కాలనీలో 300 కేజీల చొప్పున బియ్యాన్ని ట్రస్టీ చెన్నా జనార్దన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గురు రవిదాస్ బోధనలు అనుసరణీయం

తణుకు టౌన్: గురు సంత్ రవిదాస్ బోధనలు మానవాళి అభ్యుదయానికి చిరస్మరణీయమని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీ రాఘవులు అన్నారు. ఆదివారం గురు సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా పట్టణంలోని చర్మకారులకు ఆయన చిత్రపటాలను బహూకరించారు. ఈ సందర్భంగా గురు రవిదాస్ బోధనలు వివరించారు. గురు రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇంజేటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముప్పిడి సుబ్బయ్య, ఉన్నమట్ల కపర్ధి, చింతా సుబ్బారావు, స్వర్ణకుమారి, యార్లగడ్డ మురళీ కృష్ణ, ఏడుకొండలు, చిన బుల్లియ్య, తణుకు పట్టణ అధ్యక్షుడు పీ అవినాష్, చింతా సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు గృహసారథుల అవగాహన సదస్సు

పెంటపాడు: మండల గృహసారథుల అవగాహన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు ఉపముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పెంటపాడు మండల నాయకులు, గృహసారథులు విజయవంతం చేయాలన్నారు.

వీఆర్‌ఏల మండల కార్యవర్గ ఎన్నిక



వీఆర్‌ఏల నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం రూరల్: గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం తాడేపల్లిగూడెం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా గుమ్మళ్ళ వెంకటేశ్వరరావు, మాకపాటి నర్సయ్యలు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నరసింహమూర్తి, సభ్యులుగా మేకా రాములు, ఆత్రగడ్డ తాతారావు, అయినివిల్లి మీనారాణి, షేక్ సుభాన్ బీబీ, వెలుబుడి శ్రీలక్ష్మీదేవి ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు బొంగా గణేష్‌రావు, భీమవరం డివిజన్ బీవీ.ఏవి.పండు, నక్కా సుబ్బారావు ఎన్నికను పర్యవేక్షించారు.

సేవా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సమాజంలో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న వారిని గుర్తించి అవార్డులతో సత్కరిస్తున్నట్లు ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు రొక్కాల నాగబుజ్జి, ఏలూరు జిల్లా అధ్యక్షురాలు గంజి సుగుణ రత్నకుమారి, తూర్పుగోదావరి జిల్లా కో-ఆర్డినేటర్ గెద్దం మధు ఆదివారం చెప్పారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మదర్ థెరిస్సా, విలియం కేరీ, అబ్దుల్ కలాం సేవారత్న అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 63056 83467 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అన్నసమారాధన

పెంటపాడు: కె.పెంటపాడు గ్రామంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయకుని ఆలయం 36వ వార్షికోత్సవాలు పురస్కరించుకుని తోట గోపి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నసమారాధలో గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 2000 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ స్వీకరిస్తారని కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు దరఖాస్తులు అందించాలని కోరారు.

పద్మావతి అమ్మవారికి సారె సమర్పణ



తణుకులో మహిళలకు చీర, సారెను అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



ఆరవల్లిలో గ్రామ దేవతలను దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి



రేలంగిలో మంత్రి కారుమూరికి స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు టౌన్: మాఘ పౌర్ణమి సందర్భంగా పద్మశాలీ ఆడపడుచు పద్మావతి అమ్మవారికి చీర, సారె సమర్పించే కార్యక్రమాన్ని పట్టణంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీకేశవస్వామి ఆలయంలో రాష్ట్ర చేనేత ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో పద్మశాలీలు, చేనేత పెద్దలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మహిళలకు చీర సారెలను పంపిణీ చేశారు. తొలుత బొమ్మలవీధిలోని సరళాదేవి, వెంకట రమేష్‌ల నివాసం నుంచి చీర, సారె పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ తీపి కావడితో రాష్ట్రపతి రోడ్డు మీదుగా మంగళవాయిద్యాలు, కోలాటం మేళతాళాలతో ఊరేగింపుగా మున్సిపల్ కార్యాలయం వద్ద శ్రీకేశవస్వామి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి సారె, చీరలను పంపిణీ చేశారు. సారెలో నేతితో చేసిన వివిధ రకాల స్వీట్లు పనిముట్ల ఆకారంలో ఉండటంతో పలువురిని ఆకర్షించాయి. మహిళలకు మంత్రి కారుమూరి చేతుల మీదుగా సారె, చీరలను పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ జింకా విజయలక్ష్మీ, ఎంపీపీ రుద్రా ధనరాజు, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పద్మశాలీ కుల పెద్దలు నక్కా సీతారామయ్య, ఆకురాతి దుర్గారావు, నక్కా సుబ్బారావు పాల్గొన్నారు.

ఆరవల్లిలో గ్రామదేవతలను దర్శించిన కారుమూరి

అత్తిలి: ఆరవల్లి గ్రామదేవతలు శ్రీకనకదుర్గమ్మ, మావుళ్లమ్మ, మహాంకాళమ్మ, మారెమ్మ, చెవ్వళ్లమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం ఆసాదుల గరగనృత్యాలు, మేళతాళాల నడుమ శ్రీఅమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన చేశారు. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, సర్పంచ్ వెలగల సుస్మిత, రెడ్డి అండ్ రెడ్డి అధినేత గొలుగూరి శ్రీరామారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రేలంగిలో లక్ష్మీనరసింహస్వామికి పూజలు

ఇరగవరం: రేలంగిలో వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారిని మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆదివారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సూరంపూడిలో వైఎస్సార్‌సీపీనాయకులు, సర్పంచ్ కటారి చంద్రమణి, రాంబాబురాజు దంపతుల కుమార్తెకు ఇటీవల వివాహం కాగా, నూతన వధూవరులను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున, పెన్మెత్స రామభద్రరాజు, చిట్టూరి సుబ్బారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మత్స సుబ్బరాజు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, వడ్డి మార్కండేయులు, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, గ్రామపార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్ పాల్గొన్నారు.